అన్నార్థుల ఆకలి తీర్చేలా అన్నక్యాంటీన్

కదిరి, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌తో అన్నార్థుల ఆకలి తీరుస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. కదిరిలోని రోడ్లు భవనాల అతిథి భవనం పక్కన అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం దాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఎంపీ బీకే పార్థసారథిలు తెదేపా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అన్న క్యాంటీన్ నడిపి పేదల ఆకలి తీర్చిన కృష్ణమూర్తి చేత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజూ పూటకు 500 మందికి చొప్పున మూడు పూటలా ఆహారం రూ.5లకే అందుబాటులో ఉంటుందన్నారు. భవిష్యత్తులో కదిరి ప్రాంతీయ వైద్యశాలలోనూ అన్న క్యాంటీన్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కందికుంట తెలిపారు. తద్వారా ఆసుపత్రికి వచ్చే రోగులు, తోడుగా వచ్చే వారికి తక్కువ ధరకే ఆకలి తీరే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్.పార్థసారథి, జనసేన ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్, తెదేపా నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, పర్వీన్‌బాను, ఇర్ఫాన్, తదిరులు పాల్గొన్నారు.


క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎంపీ బీకే, ఎమ్మెల్యే కందికుంట తదితరులు

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి, న్యూస్‌టుడే : అల్పపీడన ప్రభావంతో ఈ నెల 14 నుంచి 17 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. సోమవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. విపత్తుల నిర్వహణ సంస్థల సూచన మేరకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులను జాగ్రత్తగా ఉండాలని సూచించామన్నారు. పాత భవనాలలో నివాసముంటున్న వారికి అధికారులే స్వయంగా వెళ్లి ప్రస్తుత పరిస్థితులను వివరించామని తెలిపారు. నీటి ప్రవాహాలను దాటకుండా ప్రజలు సురక్షితంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని తెలిపారు. జిల్లా కేంద్రంలో 24 గంటలపాటు అధికారులు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో ఘోరాలు?

- సామూహిక అత్యాచారం కేసు నిందితుల్లో ముగ్గురు మైనర్లు

హిందూపురం, న్యూస్‌టుడే: భవిష్యత్తును బంగారంగా తీర్చిదిద్దుకోవాల్సిన సమయంలో యువత దారితప్పుతోంది. గంజాయి, మద్యం ఇతర వ్యసనాల బారినపడుతున్న ఈ తరం విచక్షణ కోల్పోయి అమానుషత్వాలకు పాల్పడి భవిష్యత్తును అంధకారం చేసుకుంటోంది. చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలో రెండ్రోజుల కిందట జరిగిన సామూహిక అత్యాచార ఘటనే ఇందుకు నిదర్శనం. ఈ కేసులో ముగ్గురు మైనర్లు ఉండటం కలకలం రేపుతోంది. తరచూ దోపిడీ, దొంగతనాలకు పాల్పడుతున్న వీరు శుక్రవారం రాత్రి దోపిడీకి వెళ్లి చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి సమీపంలో ఓ వలస కుటుంబానికి చెందిన అత్తా, కోడలిపై సామూహిక అత్యాచారానికి ఒడికట్టడం వారి క్రూరత్వాన్ని తెలుపుతోంది. సామూహిక అత్యాచార సంఘటనలో మొత్తం ఆరుగురు పాల్గొనగా వీరిలో 17 ఏళ్ల వయస్సున్న వారు ముగ్గురు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దురాగతానికి పాల్పడినవారిపై ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు సమాచారం. వీరు హిందూపురం పట్టణం త్యాగరాజనగర్, మోడల్‌కాలనీకి చెందినవారిగా పోలీసులు భావిస్తున్నారు. నిందితులు గంజాయి మత్తులో ఉన్నందున ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. గంజాయి విక్రయాలపై పోలీసులు ఇప్పటికే ప్రత్యేక నిఘా ఉంచి కొంతమందిని అరెస్టు చేసి సరకు స్వాధీనం చేసుకున్నా ఇంకా ఈ విక్రయాలు కొనసాగుతున్నాయి. పోలీసులు గంజాయిని పూర్తిస్థాయిలో కట్టడి చేస్తే ఇలాంటి ఘోరాలు చోటు చేసుకోనే పరిస్థితి ఉండకపోవచ్చు.

మత్తుకు బానిసలై..

హిందూపురం పట్టణం, గ్రామీణ మండలాల్లో యువకులు అత్యధికంగా ఈ మత్తుబారిన పడుతున్నారు. గంజాయి సేవించినవారు పూర్తిగా మత్తులోకి జారుకోవటంతో వారు ఏం చేస్తున్నారన్న విషయం వారికే తెలియనిస్థితిలో ఉంటున్నారు. మద్యం, ఇతర మత్తు పదార్థాలకన్న దీని ప్రభావం అత్యధికంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అందువల్ల పోలీసులు తగుచర్యలు తీసుకొని [illegible] యాలు సమూలంగా కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.



చంటిబిడ్డ తల్లినీ వదలని క్రూరత్వం..

బాధితుల్లో ఒక మహిళకు పదినెలల బాలుడు ఉన్నాడు. అంటే పది మాసాల బాలింత అనే కనికరం లేకుండా యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడటం వీరిలో వేళ్లూనుకున్న నేర ప్రవృత్తికి నిదర్శనం. వీరి బారి నుంచి విడిపించుకొనేందుకు తల్లి బిడ్డను తీసుకొని పరుగెత్తినా దుండగులు వదల్లేదు. ప్రధానంగా తల్లిదండ్రులు తమ పిల్లలు సరైన దారిలో నడిచేలా చూడాల్సి బాధ్యతను గురుతరంగా భావించినప్పుడే కొంతైనా ఇలాంటి వాటికి అడ్డుకట్ట పడే అవకాశాలున్నాయి.

మద్యం దుకాణాల ఎంపిక ప్రశాంతం

- పలుచోట్ల సిండికేట్‌కు ప్రయత్నాలు


లాటరీ ఎంపిక ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలో మద్యం దుకాణాల లైసెన్స్‌ల ఎంపిక ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. సోమవారం 8.20 గంటలకు సాయి ఆరామంలో కలెక్టర్ టీఎస్ చేతన్ ఆధ్వర్యంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య సమక్షంలో ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలోని 87 దుకాణాల కేటాయింపును లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఉదయం 7 గంటలకే దరఖాస్తుదారులు లాటరీ ప్రదేశానికి చేరుకున్నారు. పోలీసులు దరఖాస్తుదారులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రంలోకి పంపారు. జిల్లాలో 87 దుకాణాలకు 518 దరఖాస్తులు వచ్చాయి. లాటరీ ద్వారా ఎంపిక చేయగా 82 పురుషులకు, 5 చోట్ల మహిళలకు దుకాణాలు దక్కాయి. మహిళలు పుట్టపర్తి 1, గాండ్లపెంట 1, మడకశిర 1, అమరాపురం 1, హిందూపురం 1 చోట్ల దుకాణాలు దక్కించుకున్నారు. లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వ్యక్తులతో ప్రజాప్రతినిధులు రాజీ ప్రయత్నాలు చేసి, అందులో పలువురికి అవకాశం కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్రం వద్ద డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


హాజరైన దరఖాస్తుదారులు

పారదర్శకంగా కేటాయింపు

ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో 87 మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. సోమవారం సాయిఆరామంలో జరిగిన మద్యం టెండర్ల లాటరీ ప్రక్రియను కలెక్టర్, జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, అదనపు ఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీవో సువర్ణ, జిల్లా ఎక్సైజ్ అధికారులు గోవిందనాయక్, నరసింహులు పర్యవేక్షించారు. దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ ద్వారా ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. లైసెన్స్ ఫీజు సకాలంలో చెల్లించాలన్నారు. ఈనెల 16 నుంచి దుకాణాలను కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

ఒకేవ్యక్తికి ఐదుచోట్ల

భాజపా అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుకు శ్రీసత్యసాయి జిల్లాలో 5 దుకాణాలు దక్కడం విశేషం. ధర్మవరం నియోజకవర్గ పరిధిలో 1, 5, 12, 14, 19 నంబర్ల దుకాణాలు లాటరీలో వరించాయి. మడకశిరలో 79, 80, 81 నంబర్ల షాపులు పీఎస్ వెంకటసుబ్బారెడ్డి దక్కించుకున్నారు. ఆయన భార్య వైజయంతిమాల 78వ దుకాణాన్ని చేజిక్కించుకున్నారు.

రాయలసీమ మహాకవి సమ్మేళనంపై కవితలు ఆహ్వానం

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాయలసీమ సాంస్కృతికోద్యమంలో భాగంగా రాయలసీమ మహాకవి సమ్మేళనానికి కవితలను ఆహ్వానిస్తున్నామని వేదిక సమన్వయకర్త అప్పిరెడ్డి హరినాథరెడ్డి తెలిపారు. విభిన్న రంగాల సీమ ప్రముఖులపై కవితలను డిసెంబరు 8లోగా 99639 17187 నంబరుకు వాట్సప్ చేయాలన్నారు. అన్ని ప్రాంతాల్లోని కవులు సమ్మేళనంలో పాల్గొనవచ్చన్నారు. కవితలను పుస్తక రూపంలో తీసుకొస్తామన్నారు. సాహిత్య ప్రపంచంలో రాయలసీమ సాంస్కృతికోద్యమానికి ప్రత్యేక చరిత్ర ఉందని తెలిపారు. ఔత్సాహికులు మహాకవి సమ్మేళనంలో విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉద్యాన పంటలకు తుపాను ముప్పు తప్పిద్దాం

- వర్షపు నీటినిల్వను తొలగించి కాపాడుకుందాం
- భారీ వర్షాల నేపథ్యంలో అధికారుల జాగ్రత్తలు

కదిరి, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా ఈనెల 16, 17 తేదీల్లో భారీ, అతిభారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. 14వ తేదీనే వర్షాలు మొదలయ్యాయి. భారీ వర్షాల నుంచి పండ్ల తోటలు, కూరగాయ పంటల్లో తుపాను నీరు నిల్వలేకుండా చేసి కాపాడుకోవాలని ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలో రెండ్రోజులు తుపాను ప్రభావం ఉండబోతోంది. గ్రామాల్లో ఉద్యాన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చీనీ, బొప్పాయి, ఇతర పండ్లతోటల్లో వర్షపు నీటినిల్వ లేకుండా పిల్ల కాలువలను ఏర్పాటు చేయాలన్నారు. కూరగాయల తోటల్లో నీటి నిల్వతో పంటలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పొలంలో నీటినిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బొప్పాయి: పంటను కాపాడుకోవటానికి సాగుదారులు కోతకు సిద్ధంగా ఉన్న దిగుబడులను ముందుగానే కోతకోసి విక్రయించుకోవాలి. కోతకు వచ్చిన పండ్లను తగిన పద్ధతిలో ప్యాక్ చేసి, ప్యాకింగ్ హౌసింగ్‌లలో నిల్వ చేసుకోవాలి.

పంట	ఎకరాలు
పండ్లతోటలు	: 84,353
కూరగాయలు	: 24,310
పూలతోటలు	: 1,446
ఆదాయ పంటలు	: 13,836
ఔషధ పంటలు	: 35

అరటి: పంటను కాపాడుకునేందుకు సాగు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు. గెలలు వేసిన అరటి తోటలు పెనుగాలులతో కూడిన వర్షంతో చెట్లు పడిపోకుండా కర్రలను ఊతంగా పెట్టడం ద్వారా జాగ్రత్తపడాలి. కోతకు వచ్చిన గెలలను కోతవేయడం మంచిది.

టమాటా: పంట దిగుబడులను వర్షం సమయంలో కోతలు చేపట్టకూడదు. వర్షానికి ముందే కోతతో మార్కెట్‌కు తరలించాలి. కోతకు సిద్ధంగా ఉన్న కాయలను కోసి తగిన గాలి ప్రసరించే ప్రదేశంలో నిల్వ ఉంచుకోవాలి. ట్రెల్లీస్ కింద సాగుచేస్తున్న పంటను గాలులకు పడిపోకుండా కర్రలను ఊతంగా నాటుకోవాలి. అధిక వానలకు టమోటా పంటను సోకే మచ్చతెగులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకు 2.5 గ్రాముల ఎం 45, ఒక గ్రాము కార్బెండైజిమ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవడం వల్ల మచ్చ తెగులును అదుపులో పెట్టుకోవచ్చని అధికారి వివరించారు.


టమాటా తోటలో వర్షపునీటి తొలగింపు

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సహాయ సాంఘిక సంక్షేమ అధికారి నరసింహారావు విలేకరులకు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈనెల 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్, డైట్‌సెట్, టెట్, బీఎడ్ కలిగిన వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూటమి ప్రభుత్వం వచ్చాకే గ్రామాలకు కళ

కనగానపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాతనే గ్రామాలకు కళ వచ్చిందని రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని దాదులూరులో హంద్రినీవా కాలువ ద్వారా చెరువులకు ప్రవహిస్తున్న జలాలకు పూజలు నిర్వహించారు. అనంతరం సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాప్తాడు నియోజకవర్గానికి రూ.25 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ అనిల్ కుమార్, ఏపీడీ వెంకటచలపతి, మండల కన్వీనర్ యాతం పోతలయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జి సుధాకర్‌నాయుడు, రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేశు తతరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



కన్యకాపరమేశ్వరికి ఊంజల్ సేవ

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో సోమవారం అమ్మ వారికి ఊంజల్ సేవ నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేక అలంకరణ చేశారు. దసరా శరన్నవరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ఊయలోత్సవంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకు జాతీయస్థాయిలో 23వ ర్యాంకు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: లండన్‌కు చెందిన టైమ్స్ ఉన్నతవిద్య అనే అంతర్జాతీయ సంస్థ వెల్లడించిన ర్యాంకింగ్‌లో అనంతపురం జేఎన్‌టీయూకు జాతీయస్థాయిలో 23వ ర్యాంకు దక్కింది. గత సంవత్సరం ప్రకటించిన ర్యాంకుల్లో 34వ స్థానంలో నిలిచింది. ఈ సంవత్సరం 23వ ర్యాంకు దక్కడం విశేషం. ప్రపంచస్థాయి ర్యాంకింగ్ మాత్రం మెరుగుపడలేదు. నిరుడు 801- 1000 మధ్య ర్యాంకు దక్కింది. ఈసారి కూడా 801-1000 మధ్యలోనే ర్యాకింగ్ వచ్చింది. మార్చిలో న్యాక్-ఏ గ్రేడ్ రావడం, అంతర్జాతీయ ప్రైవేటు సంస్థ ప్రకటించిన ర్యాంకింగ్‌లో మెరుగైన ర్యాంకు రావడంతో వర్సిటీకి ప్రాజెక్టులు, నిధులు మంజూరు కావడానికి అవకాశాలు లభిస్తాయి. విదేశీ విద్యార్థుల ప్రవేశాలకు కేంద్రం నుంచి అనుమతి లభిస్తుంది. న్యాక్ గుర్తింపు కోసం దరఖాస్తు చేశారు. న్యాక్‌లో మంచి గ్రేడ్ రావడానికి కూడా ఈ ర్యాంకు తోడ్పడుతుంది. ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య సుదర్శనరావు మాట్లాడుతూ నాణ్యమైన బోధన, పరిశోధన, పరిశ్రమలతో అనుసంధానం, అంతర్జాతీయ దృక్పథం తదితర అంశాలను పరిగణించి ర్యాంకులు కేటాయించారన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది కృషితోనే మెరుగైన ర్యాంకు దక్కిందన్నారు. ఇన్‌ఛార్జి వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య సిబ్బందికి అభినందనలు తెలిపారు.

పంచాయతీ కార్యాలయం.. లోపించిన పారిశుద్ధ్యం

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు, పరిసరాల శుభ్రత పాటించేలా చర్యలు తీసుకునే జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం వద్దే చెత్త పేరుకుంది. పుట్టపర్తిలో ఉన్న ఆ కార్యాలయానికి నిత్యం జనంతో పాటు ఆశాఖ సిబ్బంది వస్తుంటారు. కార్యాలయం వెనుక భాగంలో ఎంగిలి ఆకులు, ఆహారపు వ్యర్థాలు, చెత్తాచెదారం పడేశారు. దీంతో ఈగలు ముగి, కుళ్లిన వ్యర్థాలతో దుర్వాసన వస్తోంది. ఈ కార్యాలయం చుట్టూ వివిధ శాఖలకు చెందిన ఆఫీసులు ఉన్నాయి. ఇక్కడి అపరిశుభ్రతను చూసి జిల్లావ్యాప్తంగా శుభ్రత బాధ్యతలు చేపట్టే అధికారులు ఉండే చోటే ఇలా ఉంటే ఇంకెక్కడి స్వచ్ఛతా హి సేవ అంటూ విమర్శిస్తున్నారు. **- న్యూస్‌టుడే, బుక్కపట్నం**


జిల్లా పంచాయతీ కార్యాలయం వద్దే చెత్తకుప్ప

సెల్‌టవర్లు నిర్మించినా.. అరకొర సేవలే

- వినియోగదారులకు తప్పని ఇబ్బందులు
- ప్రారంభోత్సవంపై దృష్టిపెట్టని బీఎస్ఎన్ఎల్ అధికారులు


నూతనంగా ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్

కదిరి, కొత్తచెరువు, న్యూస్‌టుడే: ఆధునిక సమాజంలో టెక్నాలజీ ఎంతో కీలకం. మనిషి జీవితంలో సెల్‌ఫోన్ ఒక భాగంగా మారింది. మొబైల్ చేతిలో లేకుండా అడుగు ముందుకు పడనంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇందుకు అనుగుణంగా సమాచారం చేరవేయాలన్నా, పథకాలను అమలు చేయాలన్నా డిజిటల్ సేవలు ముఖ్య భాగమయ్యాయి. బీఎస్ఎన్ఎల్ సంస్థ నూతన సెల్‌టవర్ల ఏర్పాటుతో 4జీ సేవలను ప్రారంభిస్తోంది. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలో పుట్టపర్తి, గాండ్లపెంట, తలుపుల, తనకల్లు, ఓబుళదేవరచెరువు తదితర మండలాల్లో సుమారు 13 సెల్‌టవర్లను నిర్మించినట్లు అధికారులు చెబుతున్నారు. వీటి నిర్మాణం పూర్తయినా, ప్రారంభం, పూర్తిస్థాయి సేవలను అందించటంలో జాప్యం చేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వాటిని ప్రారంభించి మెరుగైన సేవలు అందించాలని కోరుతున్నారు.

మెరుగైన సేవల్లో జాప్యం

జిల్లాలో బీఎస్ఎన్ఎల్ కంపెనీ నూతనంగా ఏర్పాటు చేస్తున్న 13 సెల్‌టవర్ల నిర్మాణం పూర్తయి ఏడాది గడుస్తోంది. ప్రారంభానికి విద్యుత్తు సరఫరా ఏర్పాటు, నెట్‌వర్క్ పనిచేసే సాంకేతిక ప్రక్రియ పరికరాల పూర్తి పనులు ప్రహసనంగా మారాయి.

కొన్నింటిని ప్రారంభించినా సేవలు అరకొరగా అందుతున్నాయి. ఇందులో టి.పెద్దతండాలో కేవలం నెట్, వాట్సప్ కాల్స్ సదుపాయమే ఉన్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. కొర్తికోట, కొండెనకపల్లి, వీర ఓబునపల్లి, దొన్నికోటవారిపల్లి తదితర ప్రాంతాల్లోని టవర్ల సాంకేతిక పనులు తుది దశలో ఉన్నాయి.

ఈ ప్రాంతాలన్నీ అటవీప్రాంత పరిసరాలు కావడంతో సేవలు ఇబ్బందికరంగా మారాయి. బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభించింది. అందుకు నూతనంగా ఏర్పాటు చేసిన సెల్‌టవర్లు అందుబాటులోకి రాకున్నాయి. దీంతో సెల్‌సేవలు, నెట్‌వర్క్ సమస్యతో ప్రభుత్వ పథకాల్లో లబ్ధిపొందడానికి అవస్థలు పడుతున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు.

అరకొరగానే సెల్‌టవర్ సేవలు



గ్రామంలో 4జీ సేవలను అందించేలా సెల్‌టవర్‌ను నిర్మించారు. సేవలు మొదలైనా అసంపూర్తిగానే అందుతున్నాయి. ప్రస్తుతం నెట్‌వర్క్, వాట్సప్ కాల్స్ మాత్రమే వెళ్తున్నాయి. కాల్స్ వెళ్లని కారణంగా ఫోన్ మాట్లాడలేకున్నాం. సెల్‌టవర్ అందుబాటులోకి వచ్చినా అరకొర సేవలే పొందుతున్నాం. అధికారులు స్పందించి పూర్తిస్థాయి సేవలు అందించాల్సి ఉంది.

- రవినాయక్, టి.పెద్దతండా

ఫోన్లున్నా.. అలంకారప్రాయమే



కొత్తచెరువు మండలంలోని బండ్లపల్లి, బైరాపురం పంచాయతీల్లోని 12 గ్రామాలకు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పనిచేయలేదు. ఆ సంస్థ 4జీ సేవలతో మెరుగైన నెట్‌వర్క్ అందిస్తామని చెబుతున్నా, సెల్‌ఫోన్‌లు కూడా పనిచేయని పరిస్థితి. దీంతో ఫోన్‌లు ఉన్నా అలంకార ప్రాయంగా మారాయి. బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ అందేలా చూడాల్సిన అవసరం ఉంది. **- కేశప్ప, ఎర్రపల్లి**

నెలాఖరులోపు అందుబాటులోకి తెస్తాం

జిల్లాలో నూతనంగా నిర్మించిన బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్లను చాలావరకు ప్రారంభించాం. విద్యుత్తు సరఫరా సమస్యలను సోలార్‌తో అధిగమించాం. ఇంకా నాలుగైదు చోట్ల నెట్‌వర్క్ ట్రాన్స్‌మిషన్ పనులు చేస్తున్నాం. అవికూడా రెండు, మూడు రోజుల్లో పూర్తి చేస్తాం. మారుమూల గ్రామాల్లో ఏర్పాటు చేసిన టవర్లతో ఈనెల ఆఖరుకల్లా 4జీ సేవలు అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తున్నాం.

- నరసింహులు, బీఎస్ఎన్ఎల్ జేటీఓ

ఆ రెండ్రోజులు జాగ్రత్త

● జిల్లాలో భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
● 16, 17న విద్యా సంస్థలకు సెలవు ● కలెక్టర్ వినోద్‌కుమార్ వెల్లడి


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: 'రానున్న మూడు రోజులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా ఈ నెల 16, 17వ తేదీల్లో మరింత జాగ్రత్త అవసరం. ఈ రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దు' అని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం రెవెన్యూ భవన్‌లో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. అల్పపీడనం కారణంగా జిల్లాలో విస్తారంగా వానలు కురిసే వీలుందని వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిందని కలెక్టర్ చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, ఎక్కడ ఏ సమస్య తలెత్తినా సత్వరమే రంగంలోకి దిగేలా సర్వం సిద్ధంగా ఉంచామన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 16, 17న అన్ని రకాల విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎవరైన విద్యా సంస్థలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శిథిల గృహాల్లో ఎవరూ ఉండవద్దన్నారు. నగరంలోని మరవవంక, నడిమివంక పరివాహక ప్రాంతాల్లోని కాలనీల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

కలెక్టరేట్‌తోపాటు మున్సిపాల్టీల్లో, అనంత, గుంతకల్లు, కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ప్రతి నోడల్ అధికారి, మండల అధికారులు ఎక్కడికక్కడే ఉంటారన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా సత్వరమే వాట్సప్‌లకు ఫొటో, వీడియోలు పంపాలని ఆయన సూచించారు. వంతెనల పటిష్టతపై అంచనా వేస్తున్నామన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసన


నిరసన తెలుపుతున్న ఐద్వా శ్రామిక మహిళా జిల్లా కమిటీ, సీఐటీయూ నాయకులు

హిందూపురం: చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలో వలస కూలీలైన అత్త, కోడలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో సీఐటీయూ, ఐద్వా శ్రామిక మహిళా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలి, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయని వీటిని అరికట్టడంలో ప్రభుత్వం తగిన చొరవ చూపటం లేదన్నారు. జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి, అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, సోషల్ మీడియా వేదికగా మహిళలపై అసభ్యకరమైన వీడియోలు పోస్ట్ చేయటం లాంటి సంఘటనలకు కారణమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంత్యాజ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు, వెంకటేశ్, అంగన్‌వాడీ ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, ఉషారాణి, కేవీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, సీఐటీయూ పట్టణ నాయకులు వీఆర్ రాము, రామకృష్ణ, స్థానిక అంగన్‌వాడీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గరుడవాహనంపై చింతలరాయుడు



తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలో ప్రాచీన ఆలయమైన బుగ్గరామలింగేశ్వరస్వామి దేవాలయంలో నాలుగురోజుల నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం యథావిధిగా కొనసాగాయి. ఉదయం చింతల వెంకటరమణస్వామి మోహినీ అవతారంలో అలంకరించి ఊరేగించారు. సాయంత్రం స్వామిని గరుడవాహనంపై మార్కెట్ వీధి పురవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు.

పూజలందుకున్న చింతల వెంకటరమణస్వామి

విద్యుత్తు సమస్యలుంటే.. 1912 నెంబరుకు ఫోన్ చేయండి

అనంతపురం(విద్యుత్తు), న్యూస్‌టుడే: భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున విద్యుత్తు ప్రమాదాలను నివారించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్‌కుమార్ తెలిపారు. విద్యుత్తు సరఫరాకు సంబంధించి ఏ సమస్య వచ్చినా 1912 నెంబరుకు వెంటనే ఫోన్ చేయాలని ఆయన సూచించారు. ఇంటి పరిసరాల్లోని విద్యుత్తు స్తంభాలకు ఉన్న స్టే వైర్లకు ఇనుప తీగలు కట్టకూడదన్నారు. రైతులు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నియంత్రికలను సొంతంగా మరమ్మతులు చేసుకోకూడదని ఆయన సూచించారు. తుపాను ముగిసే వరకు వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

బీటీపీ ఆనకట్ట నిర్మాణం పటిష్ఠం

ప్రాజెక్టును పరిశీలించిన రాము నాయక్


గేట్లను పరిశీలిస్తున్న అధికారులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుగా పేరుగాంచిన బీటీపీ (భైరవానితిప్ప ప్రాజెక్టు) క్రస్ట్ గేట్లకు నీరు లీకేజీ కాకుండా రబ్బరు సీళ్లు వేయించాలని డ్యామ్ గేట్ల సేఫ్టీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (కడప డివిజన్ మెకానికల్ ఇన్‌ఛార్జి) రాము నాయక్ సూచించారు. సోమవారం బీటీపీకి చెందిన 12 క్రస్ట్ గేట్లు, ఎలక్ట్రిఫికేషన్, జనరేటర్ పరిస్థితులను పరిశీలించారు. ప్రాజెక్టు ఆనకట్ట నిర్మాణం పటిష్ఠంగా ఉందన్నారు. వరద వస్తే అత్యవసరంగా గేట్లు ఎత్తేందుకు విద్యుత్తు సౌకర్యం అధ్వానంగా ఉందని, జనరేటర్ల రక్షణకు గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాజెక్టు కాపలాకు లస్కర్లను ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కాకపోవడంతో సొంత నిధులతో చిన్నచిన్న పనులు చేయించామని, లస్కర్ల నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు రాయదుర్గం చిన్న నీటి పారుదల శాఖ డీఈ బలరాముడు తెలిపారు. నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని రామూనాయక్ హామీ ఇచ్చారు. ఆయన వెంట జేఈ సాయిరాం తదితరులు ఉన్నారు.

విద్యుత్తు సమస్య తలెత్తకుండా చర్యలు


సిబ్బంది, రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ సురేంద్ర

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : వ్యవసాయానికి విద్యుత్తు సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్తు శాఖ ఎస్ఈ సురేంద్ర సిబ్బందికి సూచించారు. ఈ నెల 12వ తేదీ కొడవండ్లపల్లి విద్యుత్తు ఉపకేంద్రం ఎదుట రైతులు కార్యాలయానికి తాళంవేసి విద్యుత్తు అంతరాయంపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఎస్ఈ పరిశీలించి ఉపకేంద్రంలోని మరమ్మతులను చేయించారు. ఇకపై రైతులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తామని తెలిపారు. ఎస్ఈతోపాటు ఇన్‌ఛార్జి ఏఈ శివతేజ పాల్గొన్నారు.

18న ఈ-పంట నమోదు తుది జాబితా విడుదల

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: 'సామాజిక తనిఖీలో భాగంగా జిల్లాలో గత ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు ముసాయిదా జాబితాను ఈనెల 16వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ప్రదర్శిస్తారు. రైతు సేవా కేంద్రాల్లో గ్రామ సభలు నిర్వహించి జాబితా చదివి వినిపిస్తారు. ఏమైన అభ్యంతరాలుంటే గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన, పట్టుపరిశ్రమ సహాయకులకు రాత పూర్వకంగా అందజేయాలని' జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. జిల్లాలో మొత్తం 10,54,356 ఎకరాల్లో ఈ-పంట నమోదు చేశామన్నారు. 2,97,072 మంది రైతులు ఉంటే 2,85,340 మంది ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. సవరణ కోసం ప్రభుత్వం చివరి అవకాశం ఇచ్చిందన్నారు. ఈనెల 18న తుది జాబితా విడుదల చేస్తామని, ఆ తర్వాత మార్పులు, చేర్పులు ఉండవని డీఏవో స్పష్టం చేశారు.

పప్పుసెనగ విత్తనాలకు 13,397 మంది పేర్లు నమోదు

జిల్లాలో రబీలో పప్పుసెనగ రాయితీ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 18,808 క్వింటాళ్ల విత్తనం కావాలని 13,397 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు.

పండ్ల తోటల సాగు.. లాభాలు బాగు


అరటి గెల చూపుతున్న రైతు రామ్మోహన్‌రెడ్డి

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ముదిగుబ్బ మండలం మర్తాడు గ్రామానికి చెందిన రైతు రామ్మోహన్‌రెడ్డి పండ్ల తోటలు సాగు చేస్తూ ఆదాయం ఆర్జిస్తున్నారు. తనకున్న ఆరున్నర ఎకరాల్లో చీనీ, అరటి, పెసర సాగు చేశారు. రెండున్నర ఎకరాల్లో ఆగ్రోబిట్ రకానికి చెందిన అరటి నాటారు. ముందుగా భూమిని ఐదు మడకలతో దున్నించి పేడ ఎరువులు వేశారు. ఒక్కో మొక్క రూ.12తో హైదరాబాద్ నుంచి తెప్పించారు. ఎకరాకు 1500 చొప్పున గతేడాది మేలో రెండున్నర ఎకరాల్లో 3,500 మొక్కలు నాటించారు. తెగుళ్ల వ్యాపించడంతో మందులు పిచికారీ చేశారు. కాయ నాణ్యతగా వచ్చింది. మొక్క నాటినప్పటి నుంచి కూలీ, సేద్యం ఖర్చులన్నీ కలిపి రూ.3లక్షలు పెట్టుబడి పెట్టారు. సెప్టెంబరులో కోత కోయగా ఎకరాకు 30టన్నుల చొప్పున మొత్తం 75టన్నుల దిగుబడి వచ్చింది. 7టన్నులు సూట్ పోగా 67 టన్నులను ఒక టన్ను రూ.16వేలతో విక్రయించారు. రూ.10లక్షలు రాబడి రాగా పెట్టుబడిపోనూ రూ.7లక్షలు మిగిలాయి.

రెండున్నర ఎకరాల్లో చీనీ.. : పదేళ్ల కిందట రెండున్నర ఎకరాల్లో చీనీ పంట సాగు చేశారు. ఒక మొక్క రూ.100తో లింగాల మండలంలో కొనుగోలు చేశారు. ఎకరాకు రూ.150 చొప్పున రెండున్నర ఎకరాల్లో 360 మొక్కలు నాటారు. ఎర్రనేల కావడంతో భూమి మరింత సారవంతంగా ఉండేందుకు నల్లమట్టి తోలించి చెట్టు మొదళ్లో వేయించారు. మొక్క నాటినప్పట్నుంచి కోతకోసే వరకు ఎరువులు, మందులు అన్నీ కలిపి రూ.2లక్షల పెట్టుబడి పెట్టారు. మొదటి కోతలో 10టన్నులు, రెండో కోతలో 42టన్నులు, మూడో కోతలో 8టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ.16వేలు, రూ.32వేలు, రూ.48వేలు చొప్పున విక్రయించడంతో మొత్తం రూ.10లక్షలు రాబడి వచ్చింది. పెట్టుబడి పోనూ రూ.8లక్షలు చేతికందాయి.

మార్కెట్లో ధరలు కలిసొచ్చాయి - రామ్మోహన్‌రెడ్డి

అరటి, చీనీ పంటల దిగుబడి వచ్చినప్పుడు మార్కెట్‌లో ధరలు కలిసొచ్చాయి. గత నెల ఒకటిన్నర ఎకరాలో రూ.10వేలు ఖర్చుపెట్టి పెసర పంట సాగు చేశాను. పెసర క్వింటా రూ.7వేలు పలుకుతుంది. కోతకోసే సమయానికి అదే ధర కొనసాగితే పెట్టుబడిపోయి రూ.40వేల వరకు లాభం వస్తుంది.

సమస్య-సమాధానం


నజీరుద్దీన్ (వ్యవసాయ శాస్త్రవేత్త)

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: పంటల సాగులో రైతులకు ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త **నజీరుద్దీన్** 99665 05285 నంబరుకు ఫోన్ చేసి తగిన సలహాలు పొందవచ్చు.

సమస్య: పత్తి పంటలో పూత, పిందెలు రాలుతున్నాయి. సమస్యను ఎలా అధిగమించాలి. **- నాగభూషణ(రేగడికొత్తూరు)**

సమాధానం: పత్తిలో పూత, పిందెలు రాలుతుంటే రైతులు వెంటనే ఎసిటిక్ యాసిడ్ 10 పీపీఎమ్ ద్రావణాన్ని 1 మి.లీ, డైఅమ్మోనియం ఫాస్పేట్ ద్రావణంలో కలిపి పిచికారీ చేస్తే పూత, పిందెలు రాలకుండా నివారించవచ్చు.

సమస్య: వరి పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో పంటకు సుడిదోమలు ఆశించి దెబ్బతీస్తున్నాయి. నివారణకు ఎలాంటి మందులు వాడాలి.

- వన్నూర్‌వలి, జంతలూరు

సమాధానం: వరిపైరులో సుడిదోమల ఉద్ధృతిని గుర్తించిన వెంటనే రైతులు ఆలస్యం చేయకుండా డైనోటిఫ్యూరాన్ 0.4 గ్రాములు, పైమెట్రోజైన్ 0.6 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

చీనీ తోటల్లో తెగుళ్లకు పరిష్కారమిలా..

చిట్కా

చీనీ తోటల్లో అధిక దిగుబడి పొందాలంటే తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. పంటకు ఆశించే మంగునల్లి నివారణకు ఇథియాన్ 2 మి.లీ, ప్రోపర్గైట్ 2 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పంటకు ప్రధానంగా ఆశించే గజ్జి తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ 0.3 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి నెల రోజుల వ్యవధిలో మూడుసార్లు పిచికారీ చేసుకుంటే నాణ్యమైన కాయల దిగుబడి పొందవచ్చని శాస్త్రవేత్త తెలిపారు. **- న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం**

సెనగ పంటలో యాజమాన్య పద్ధతులు పాటిద్దాం

కళ్యాణదుర్గం : రబీలో పప్పుసెనగ సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు తెలిపారు. జిల్లాలో ఎన్‌బీఈజీ 452, జెజి-11, ఎన్‌బీఈజీ-857 వంటి పప్పు సెనగ రకాలు అనువైనవి. ఈ నెల 15 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు విత్తు నాటేందుకు అనువైన సమయం. విత్తుకునే ముందు కిలో విత్తనానికి 3గ్రాముల కార్బెండజిమ్ లేదా 1.5గ్రాముల టెబుకోనజోల్, 8-10గ్రాముల ట్రైకోడెర్మాతో విత్తన శుద్ధి చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల ఎండు తెగులును తట్టుకొని నష్టం నివారించవచ్చని చెప్పారు. విత్తనం విత్తిన 24గంటల్లోపే ఎకరాకు 1-1.2మి.లీ పెండి మిథాలిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కేవీకేలో సంప్రదించాలని తెలిపారు.

కందికి చీడపీడలు.. నివారణ చర్యలు


సోమందేపల్లిలో సాగు చేసిన కంది పంట

రైతేరాజు

కదిరి, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌లో సాగైన కంది పంటలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడిని కాపాడుకోవచ్చని కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త రమేశ్ నాయక్ సూచించారు. శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా సాధారణ సాగుకంటే అధిక విస్తీర్ణంలో రైతులు కందిపంట సాగు చేశారు. కందికి మొగ్గ దశలోని శనగ పచ్చ, పూతకు మరుకా మచ్చల పరుగులు ఆశిస్తాయి. పిందె, కాయ వృద్ధిచెందే సమయంలో ఈగ పురుగుల సమస్య ఉంటుందని తెలిపారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

✦ కంది మొగ్గ, పూత, పిందె దశలో శనగపచ్చ పురుగు పట్టి కాయలకు రంధ్రాలు చేసి గింజలను తింటుంది. ఇలా పంట మొత్తం వ్యాపిస్తుంది. ఈ పురుగు ఉనికిని, ఉద్ధృతిని గమనించడానికి ఎకరాకు నాలుగు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. ఈ పురుగు గుడ్లను మొగ్గమీద గమనించిన వెంటనే 10,000 పీపీఎం వేపనూనె కషాయాన్ని 2 మి.లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఉద్ధృతిని బట్టి ఇండోక్సా కార్బ్ లేదా డెల్టా మెత్రిన్ 0.9 మి.లీ. లేదా ల్యాండా సైహాలోత్రిన్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

✦ పూత, కాయ దశలో ఆశించే మరుకా మచ్చల పురుగు (దీనినే వాడుకలో పూత, గూడు పురుగు, బూజు పురుగుగా పిలుస్తారు.) ఈ పురుగు ఒకటి, రెండు దశల్లో మొగ్గ లోపలే ఉంటుంది. తర్వాత దశలో లేత ఆకులు, పూత, పిందె, కాయలను కలిపి గూడుగా చేసుకుని కాయ లోపలికి వెళ్లి గింజలను తినేస్తుంది. తద్వారా కాయలను డొల్లగా చేస్తుంది. దీని నివారణకు స్పైనోసాడ్ 0.3 మి.లీ, నొవల్యూరాన్ 1.0మీలీ, క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ., స్పినోరామ్ 0.75 మి.లీ. నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

✦ కాయ ఈగ తల్లిపురుగు లేత పిందె దశలో కాయలపై గుడ్లు పెడుతుంది. పిల్ల పురుగు కాయలోపలే ఉండి గింజలను తింటాయి. ఈ పురుగు అన్ని దశలను పూర్తి చేసుకుని తల్లిపురుగు మాత్రమే బయటకు వస్తుంది. దీని నష్టం బయటకు కనిపించదు. ఈ పురుగు నివారణకు డెల్టామెత్రిన్ ఒక మి.లీ, ఇండెక్సాకార్బ్ ఒక మి.లీ, ల్యాండా సైహాలోత్రిన్ ఒక మి.లీ నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే పంటను కాపాడుకోవచ్చు.

హైడ్రామా నడుమ ముగిసిన అపహరణ వ్యవహారం


డీఎస్పీ విజయకుమార్‌తో మాట్లాడుతున్న రంగనాథ్

పుట్టపర్తి, న్యూస్‌టుడే : పుట్టపర్తిలో మద్యం లాటరీ నిర్వహించిన సాయిఆరామం వద్ద జరిగిన చిలమత్తూరు మండలం యగ్నిశెట్టిపల్లికి చెందిన రంగనాథ్ కిడ్నాప్ వ్యవహారం హైడ్రామా మధ్య ముగిసింది. తన భర్తను కిడ్నాప్ చేశారని ఆచూకీ తెలియజేయాలని అతని భార్య అశ్విని సాయిఆరామం వద్ద ఆందోళన చేపట్టారు. రంగనాథ్ తననెవరూ కిడ్నాప్ చేయలేదని హిందూపురం 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు తెలియజేశారు. తన ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో తనను కిడ్నాప్ చేశారని అనుకుని తన భార్య భయభ్రాంతులకు గురై ఆందోళన చేసిందన్నారు. తన భర్తను తనకు అప్పగించాలని పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్ దగ్గర బంధువులతో కలిసి ఆందోళనకు దిగిన ఆమెతో చరవాణిలో భర్తను మాట్లాడించినప్పటికీ ఒప్పుకోలేదు. ఎట్టకేలకు హిందూపురం నుంచి రంగనాథ్‌ను పుట్టపర్తి అర్బన్ స్టేషన్‌కు తీసుకొచ్చి భార్య, ఇతర కుటుంబ సభ్యులకు డీఎస్పీ విజయకుమార్ అప్పగించారు. తననెవరూ కిడ్నాప్ చేయలేదని పుట్టపర్తి పోలీసులకు రంగనాథ్ తెలిపారు.

అత్యాచార ఘటనలో నిందితుడిపై కేసు

తాడిమర్రి, న్యూస్‌టుడే : తాడిమర్రి మండలానికి చెందిన యువకుడు వినయ్ కుమార్‌పై అత్యాచారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. సోమవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. వినయ్‌కుమార్ వ్యవసాయ పనులు చేస్తున్నాడు. 19 ఏళ్ల యువతిపై నిందితుడు పలుమార్లు అత్యాచారం చేసినట్లు విచారణలో తేలిందన్నారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్యాచారం కేసు నమోదు చేసి, నిందితున్ని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. గతంలో ఈ యువకునిపై పోక్సో కేసు నమోదైందన్నారు.

మమ్మల్ని బస్సెక్కించి.. నువ్వు పాడెక్కావా భాస్కరా


భాస్కర్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : మమ్మల్ని బస్సెక్కించి.. బైకులో వస్తానంటూ పాడెక్కావా భాస్కరా అంటూ కుటుంబ సభ్యులు రోదించినతీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. కదిరి మండలం పట్నం వద్ద జాతీయరహదారి 42పై లారీ - ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో భాస్కర్ (24) మృతి చెందారు. పట్నం గ్రామానికి చెందిన భాస్కర్ ఉపాధి కోసం అనంతపురం వెళ్లి అక్కడే కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. పాల వ్యాను డ్రైవర్‌గా పనిచేసే అతను భార్య సీమంతం కోసం స్వగ్రామమైన పట్నానికి శనివారం వచ్చారు. ఆదివారం బంధువులు, మిత్రులతో కలిసి సీమంతం వేడుక, విందుతో సంతోషంగా గడిపారు. తాను సాయంత్రం ద్విచక్ర వాహనంపై వస్తానన్న తల్లిదండ్రులు, భార్య లక్ష్మిని సోమవారం ఉదయం అనంతపురం బస్సెక్కించారు. సొంతూరులో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై రాత్రి అనంతపురం బయలుదేరిన నిమిషాల వ్యవధిలోనే హంద్రీనీవా కాలువ మోరీ వద్ద లారీ ఢీకొని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు హుటాహుటిన అక్కడికి చేరుకుని కదిరి ఆసుపత్రికి తరలించారు. భార్య సీమంతం కార్యక్రమంలో బంధువులు, కుటుంబ సభ్యులు సందడిగా గడిపిన ఆ ఇంట విషాదం అలుముకుంది. భాస్కర్ మరణవార్త తెలుసుకున్న భార్యలక్ష్మి, తల్లి దండ్రులు, గుండెలు పగిలేలా రోదించారు. కదిరి గ్రామీణ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ మోహన్ తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తూ.. కానరాని లోకాలకు

మరో వ్యక్తికి తీవ్ర గాయాలు


కరియన్న

కణేకల్లు, న్యూస్‌టుడే: దైవ దర్శనానికి ద్విచక్ర వాహనంపై వెళ్తూ గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కుందుర్పి మండలం ఎనుములదొడ్డికి చెందిన కరియన్న (56) అనంత లోకాలకు చేరుకున్నారు. ఈ ఘటన సోమవారం కణేకల్లు మండలం యర్రగుంట శివారు రైస్‌మిల్లు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా.. బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి దర్శించుకుని, మాల ధరించడానికి కుందుర్పి మండలం కొత్తూరుకు చెందిన బావమరిది వెంకటేశులుతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. యర్రగుంట శివారు రైసుమిల్లు వద్ద ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కరియన్న తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందగా, వెంకటేశులు గాయపడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

జలాశయం వద్ద కుటుంబీకులకు మంత్రి సవిత ఓదార్పు


చంద్రశేఖర్‌రెడ్డి


కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మంత్రి సవిత

పెనుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లపల్లి జలాశయంలో ఆదివారం గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అమ్మవారిపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(19) మిత్రులతో కలిసి ఆదివారం గొల్లపల్లి జలాశయానికి ఈతకు వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. ఆదివారం రాత్రి వరకు అగ్నిమాపకశాఖ సిబ్బంది గాలించినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సోమవారం ఉదయం జలాశయం వద్దకు వెళ్లారు. అప్పటికే యువకుడి మృత దేహం నీటిలో తేలడంతో బయటకు తీశారు. యువకుడి మృత దేహానికి మంత్రి సవిత నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకటరమణ వివరించారు.

కారులో గొర్రె అపహరణ.. పట్టుకున్న పోలీసులు


నిందితులతో తంబళ్లపల్లి పోలీసులు

గాండ్లపెంట, న్యూస్‌టుడే : జీవాల మందలో ఉన్న ఓ గొర్రెను కారులో వేసుకుని అపహరించుకుపోతున్న నిందితులను గాండ్లపెంట పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. కర్ణాటకలోని కోలార్‌కు చెందిన తిప్పన్న కుటుంబ సభ్యులు తంబళ్లపల్లి వద్ద నుంచి కారులో ప్రయాణిస్తున్నారు. వారు ఎద్దులొల్లకోట వద్ద మందలో ఉన్న ఒక గొర్రెను కారులో వేసుకుని అపహరించుకుని వెళుతుండగా గ్రామస్థులు చూసి గొర్రెల యజమాని నరసింహులుకు సమాచారం ఇచ్చారు. బాధితుడు కారును వెంబడిస్తూ పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు అప్రమత్తమై రెక్కమాను వద్ద కారును ఆపే ప్రయత్నం చేశారు. అక్కడ కారు నిలపకుండా గాండ్లపెంట వైపు వెళుతుండగా గాండ్లపెంట పోలీసులకు సమాచారం తెలపడంతో కానిస్టేబుల్ భాస్కరరాజు కారును ఆపే ప్రయత్నం చేశారు. కారు వేగంగా వస్తుండటంతో వెంటనే ప్రధాన రహదారిపై బొలెరో, తాగునీటి ట్యాంకు వాహనం అడ్డంగా పెట్టించడంతో వచ్చిన కారు వాటిని ఢీకొట్టి ఆగింది. వెంటనే అక్కడికి చేరుకుని వారిని పట్టుకున్నారు. వెంటనే స్టేషన్‌కు తరలించి విచారించారు. అనంతరం తంబళ్లపల్లి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి పోలీసులు వచ్చి విచారించి వారిని అదుపులోకి తీసుకుని కారుతో సహ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

మామిడి మొక్కల నరికివేత


ధ్వంసమైన మామిడి మొక్కలు

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరం మండలం మల్లేనిపల్లికి చెందిన భాజపా నాయకుడు పూజారి నరసింహులు వ్యవసాయ తోటలో 35 మామిడి మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. సోమవారం వ్యవసాయతోటకు వెళ్లిన నరసింహులు తోటలో మామిడి మొక్కలు నరికివేసిన విషయం గమనించారు. రెండేళ్ల వయసు ఉన్న మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారని ధర్మవరం గ్రామీణ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వివరాలు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

తాగునీటి సమస్య పరిష్కారం



◄ బోరుకు పైపులు బిగిస్తున్న మెకానిక్‌లు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: గుడ్డంపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై 'ఈనాడు'లో 'తాగునీటి సమస్య పరిష్కరించండి' శీర్షికన కథనం వెలువడడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. బోరుకు కొత్త పైపులు అమర్చి, మోటారుకు మరమ్మతులు చేసి ప్రజలకు నీరందించారు. కాలనీవాసులు 'ఈనాడు'కు అభినందనలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో పూజలు



అలంకరణలో స్వామివారు

పెనుకొండ : పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో సోమవారం ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం స్వామి వారిని రంగురంగుల పువ్వులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి: ఆర్డీవో

పరిగి, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశముందని మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని పెనుకొండ ఆర్డీవో టి.ఆనంద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం పరిగిలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వర్షాల అప్రమత్తపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సిమెంటు రోడ్లే.. నడిచేందుకు పనికిరావంతే..

• దశాబ్దాలుగా డ్రైనేజీలు లేక అవస్థలు



నారాయణమ్మకాలనీలో అంతర్గత సిమెంటురోడ్డు దుస్థితి

పెనుకొండ, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రం పెనుకొండ నగరపంచాయతీలోని నారాయణమ్మ కాలనీలో రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదు. కనీసం డ్రైనేజీలు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2014-19లో తెదేపా పాలనలో సిమెంటు రోడ్లు నిర్మించారు, కాని డ్రైనేజీలు నిర్మించడం విస్మరించారు. సిమెంటు రోడ్లు నిర్మించినప్పటి నుంచి కాలనీలో మురుగు సమస్యలు మొదలయ్యాయి. లోతట్టు ప్రాంతంలో మురుగునీరు నిలిచిపోతున్నాయి. 2019-24 మధ్య వైకాపా పాలనలో అనేక మార్లు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు గడపగడపకు వెళ్లిన సమయంలో కాలనీ వాసులు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. కాలనీ అభివృద్ధికి మంచి రోజులు వచ్చాయని ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

కాలనీలో సిమెంటు రోడ్లు నిర్మించినప్పటి నుంచి లోతట్టు ప్రాంతంలో సిమెంటు రోడ్డుపై మురుగునీళ్లు నిలిచిపోతున్నాయి. వీటికితోడు ఒక్క రోజు వర్షం కురిస్తే నెలరోజుల పాటు సిమెంటు రోడ్డుపై మురుగు, వర్షం నీళ్లు నిలిచిపోయి కనీసం రోడ్డుపై నడిచేందుకు కూడా అవకాశం లేకుండా పోతోంది. వీధిలో నివాస గృహాల్లో వెళ్లేందుకు స్థానికులు అనేకపాట్లు పడుతున్నారు. నెలరోజుల కిందట ఖాళీ స్థలంలో గుంత తవ్వించినా ఫలితం శూన్యం. ఇక్కడ ఉన్న ఎన్టీఆర్ శుద్ధజల కేంద్రంలో నీళ్లు పట్టుకు



కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగు

నేందుకు వెళ్లడానికి దారిలేక నిరుపయోగంగా మిగిలిపోయింది.

పరిశీలించి చర్యలు చేపడతాం

గతంలో ఏమి జరిగిందో తెలియదు. నేను ఇటీవల బాధ్యతలు తీసుకున్నాను. కాలనీలో సమస్యలను పరిశీలించి, సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతాను. ప్రస్తుతం తుపాను ప్రభావం ఉంది. కాలనీలో నీళ్లు నిల్వకాకుండా వెంటనే చర్యలు చేపడతాం.

● శ్రీనివాసులు, కమిషనర్, నగరపంచాయతీ, పెనుకొండ

జారిపడి కాలు విరిగింది - షకీర్, స్థానికుడు

మా ఇంటి ముందు వర్షం నీళ్లు, మురుగు నిలుస్తోంది. వైకాపా ప్రభుత్వంలో ఫిర్యాదు చేసినందుకు రేషన్‌కార్డు, పింఛను తొలగించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందకుండా చేశారు. నా వయసు 68 ఏళ్లు. ఇంటి ముందు మురుగునీళ్లపై దాటుతూ ప్రమాదవశాత్తు నా భార్య కిందపడి కాలువిరిగింది. ఇటీవల తాత్కాలికంగా గుంత తవ్వినారు. అయినా నీళ్లు నిలుస్తున్నాయి.

ఆరోగ్య ఉప కేంద్రాలు.. శిథిలమైన భవనాలు



కొడిగెనహళ్లిలో శిథిలావస్థకు చేరుకున్న ఆరోగ్య ఉప కేంద్రం

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 25 ఏళ్ల కిందట నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాల భవన సముదాయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పరిగి మండలంలోని మోదా, కొడిగెనహళ్లి, హొన్నంపల్లి, శాసనకోట తదితర గ్రామాల్లో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ధనాపురం ఉన్న కేంద్రం శిథిలావస్థకు చేరుకుని కూలిపోయింది. శిథిలావస్థకు చేరుకున్న ఉప కేంద్రాల స్థానే కొత్తగా ఆరోగ్య ఉప కేంద్రాలను భవనాలను నిర్మించేందుకు స్థల సేకరణ చేసి స్థానిక వైద్యాధికారులు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదికలు పంపినా నేటికీ ఆరోగ్య ఉప కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మాణానికి నోచుకోలేదు.

● కొడిగెనహళ్లిలో 10వేలకు పైబడి జనాభా ఉంది. ఇక్కడ గతంలో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో వైద్య సిబ్బంది అంగన్‌వాడీ సెంటర్లో తాత్కాలంగా ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతి ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోనే ఇదే పరిస్థితి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైద్య సేవలు అందించేందుకు వీలుగా మండలంలోని పంచాయతీ కేంద్రాల్లో ఆరోగ్య ఉకకేంద్రాలకు పక్కా భవనాలను నిర్మించేందుకు ప్రజాప్రతినిదులు అధికారులు చొరవ తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● మండల పరిధిలోని 53,860పైగా జనాభా ఉంది. పరిగి పీహెచ్‌సీలో ప్రతి నిత్యం 200 మందికి ఓపీ వైద్య సేవలు అందిస్తున్నారు. వీరికితోడు గర్భిణులకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా 15 సబ్ సెంటర్లు ఉన్నాయి. వాటిలో ఊటుకూరు, బీచిగానపల్లి సబ్‌సెంటర్లకు పక్కాభవన నిర్మాణాలు పూర్తి చేసిన వాటిలో వైద్య సేవలు ప్రారంభం కాలేదు. మిగిలిన కేంద్రాల్లో పక్కా భవనాల ఊసే లేదు.

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం

శిథిలావస్థలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాలను పూర్తిగా తొలగించి కొత్తగా భవన సముదాయాలను నిర్మించేందుకు తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లాం. మంత్రి సానుకూలంగా స్పందించారు. కొన్ని చోట్ల స్థల సేకరణ పూర్తి చేశాం. **-డా.స్వరూపారెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పరిగి.**

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య : పెద్దకోడిపల్లిలో ట్యాంకు వద్ద నీరు వృథా అవుతోంది. **-నాగన్న**
సమాధానం : పరిశీలించి చర్యలు తీసుకుంటాం.- **గోవిందప్ప, కార్యదర్శి**
సమస్య : ఎల్‌జీబీనగర్‌లో గుంతలతో రాకపోకలకు ఇబ్బంది. **-వెంకటేశులు**
సమాధానం : నిధులు మంజూరు కావాల్సి ఉంది. **-మోహన్, ఏఈ, రొద్దం**
సమస్య : పి.బసవన్నపల్లిలో వీధి దీపాలు వెలగడం లేదు. **- రామాంజి**
సమాధానం : మరమ్మతు చేయిస్తాం.- **అశ్వర్థనారాయణ, సర్పంచి, పులమతి.**
సమస్య : కర్ణాటక రాష్ట్రం నగరగెర సరిహద్దు నుంచి మైదుగోళం వెళ్లే రహదారి మొత్తం కంకరతేలి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **-షాబుద్దీన్**
సమాధానం : ఉపాధిహామీ నిధులతో రహదారిని నూతనంగా ఏర్పాటు చేస్తాం. **- నరసింహమూర్తి, ఎంపీడీవో, లేపాక్షి.**

-న్యూస్‌టుడే, రొద్దం, లేపాక్షి

ఘనంగా పల్లె పండగ ప్రారంభం



అమ్మవారిపల్లిలో సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో నరేశ్‌కృష్ణ

పెనుకొండ, న్యూస్‌టుడే: మూడు నియోజకవర్గాల్లో సోమవారం పల్లె పండగ కార్యక్రమాన్ని అధికారులు, నాయకులు ఘనంగా ప్రారంభించారు. పెనుకొండ మండలం అమ్మవారిపల్లిలో ఎంపీడీవో నరేశ్‌కృష్ణ ఆధ్వర్యంలో పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈనెల 19 వతేదీ వరకు పల్లెపండగ కొనసాగుతుందన్నారు. ఏపీవో జయమ్మ, ఈవో పీఆర్డీ శ్రీదేవి, ఏపీఎం రవిచంద్రరాజు, పలువురు తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: గొళ్లమారనపల్లి, నిద్రఘట్ట, హేమావతి గ్రామాల్లో పల్లె పండగ నిర్వహించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీవో రామారావు, తాలూక ఎస్సీసెల్ అధ్యక్షుడు జయకుమార్, నాయకులు పాల్గొన్నారు.

లేపాక్షి: కొండూరు పంచాయతీ తిమ్మగానిపల్లిలో రూ.15లక్షలతో సిమెంట్ రోడ్ నిర్మాణానికి సర్పంచి సిద్ధార్థ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఎంపీడీవో నరసింహమూర్తి, డ్వామా ఏపీడీ శివానందనాయక్, ఈవోఆర్డీ ఆనంద్, ఉపాధి ఏపీవో మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచులు శ్రీరాములు, శివప్ప, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: కరికెర, దేవరహట్టి పంచాయతీ గ్రామాల్లో నిర్వహించారు. ఒక్కొక్క పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున మంజూరైన నిధులతో సీసీదారుల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.

గ్రామాభివృద్ధికి తెదేపా కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే



తాగునీటి బోరు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి తెదేపా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు పేర్కొన్నారు. మండలంలోని గౌడనహళ్లి గ్రామంలో నిర్వహించిన పల్లెపండగ వారోత్సవ కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షలతో సీసీదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.25 కోట్లు మంజూరైందని, ఉపాధిహామీ పథకం ద్వారా ప్రతి గ్రామంలోనూ సీసీదారులు, వ్యవసాయ కుంటలు, ఇంకుడు గుంతలు, పశువుల శాలలు తదితర పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో నూతనంగా తవ్వించిన కొత్త బోరును ప్రారంభించారు. మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజు, ప్రధాన కార్యదర్శి కోట్ల రంగే గౌడు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీబాబు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

లేపాక్షి : బోళసముద్రానికి చెందిన రెండు పేద కుటుంబాలకు లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్, రమామణి ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రమానందన్ రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు. రెండు రోజులక్రితం గ్రామానికి చెందిన బాలు గుండెపోటుతో మృతి చెందాడు. పరామర్శించి తక్షణ సాయంగా రూ.10వేలు అందించారు. అదేవిధంగా ఎస్సీ కాలనీకి చెందిన రామాంజినప్ప మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. తెదేపా నాయకులు జయచంద్ర, దుర్గానాని, మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50,116 విరాళం

గోరంట్ల: వానవోలులో వెలసిన పురాతన కస్తూరి రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణానికి గుంటిపల్లి గ్రామానికి చెందిన శిరగం వెంకటరంగారెడ్డి జ్ఞాపకార్థం భార్య రామకృష్ణమ్మ, కుమారులురూ.50,116లు విరాళాన్ని ఆలయ పూజారి శ్రీధర్, అభివృద్ధి కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. అలాగే ఓబుళదేవరచెరువు మండలం బాబాసాహేబ్‌పల్లి గ్రామానికి చెందిన శ్రావణి, ప్రసన్నకుమార్ దంపతులు రూ.10,116లు విరాళంగా అందజేశారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

అగళి, న్యూస్‌టుడే: యం.రాయాపురంలో విశ్రాంత ఉపాధ్యాయుడు, ధర్మదర్శకులు బి.వీరన్న కర్మక్రియలు సోమవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల అర్పించారు. ఉపాధ్యాయ వృత్తిలో చేపట్టిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయన్నారు. సోదరుడు బి.శివలింగప్ప, అల్లుడు నివృత్తి ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ చిక్కప్పయ్య, తెదేపా మండల్ కన్వీనర్ దాసిరెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

భూ నిర్వాసితులకు ఉద్యోగం ఇవ్వాలని వినతి

పెనుకొండ : నాసన్, బెల్ పరిశ్రమలకు భూములిచ్చిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఆర్‌అండ్‌ఆర్‌ప్యాకేజీ, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ సోమవారం ఏపీ వ్యకాసం(వ్యవసాయ కార్మిక సంఘం) జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత ఆధ్వర్యంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు వినతి పత్రం అందజేశారు.

కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని..

పెనుకొండ : భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉచితంగా ఇసుక అందించాలని కోరుతూ భవన నిర్మాణం కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రవి ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు వినతి పత్రం అందజేశారు. పలువురు కార్మికులు, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు రూ.10 లక్షల పరిహారమివ్వాలి..

పెనుకొండ : ఈనెల 12న నల్లబొమ్మనపల్లిలో జరిగిన అత్యాచారం ఘటనలో బాధితులకు ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ.10లక్షలు పరిహారం చెల్లించాలని, పనరావాసం కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులకు బెయిల్ ఇవ్వకుండా కఠినంగా శిక్షించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో డీటీ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు

మాజీ యానిమేటర్‌పై దాడి

సోమందేపల్లి, న్యూస్‌టుడే: పత్తికుంటపల్లిలో వైకేపీ మాజీ యానిమేటర్ సరస్వతిపై బాధిత డ్వాక్రా సభ్యులు, కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి దాడి చేసినట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో గ్రామంలోని పలు డ్వాక్రా సంఘాల సభ్యులు తమ రుణాల కంతులను బ్యాంకులో చెల్లించకుండా రూ.8 లక్షల వరకు కాజేసినట్లు ఆరు నెలలకు పైగా బాధిత సభ్యులు పోలీసులకు, వెలుగు ఏపీఎం, చివరకు డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. చివరకు గతనెలాఖరులో అందరికీ అందజేస్తామని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రమేశ్ బాబు ఎదుట అంగీకరించినా, పూర్తిగా అందించలేదు. తన సొమ్ము రూ.20 వేలు ఇవ్వాలని సభ్యురాలు నంజమ్మ, భర్త మూర్తితో కలసి ఆమెను నిలదీసిన సమయంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకొన్నట్లు సమాచారం. అయితే ఆమెపై తెదేపా నాయకులు దాడి చేశారని, గాయ పడటంతో 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈవిషయంపై ఎస్సై రమేశ్ బాబు మాట్లాడుతూ బాధిత డ్వాక్రా సభ్యులకు ఆమె చెల్లించాల్సిన సొమ్ము విషయంలో ఘటన జరిగి ఉంటుందని, గ్రామంలో విచారించి, చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

నగదు తీసుకుని మోసగించాడని మహిళల నిలదీత



సీపీఐ వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామిని నిలదీస్తున్న సోమందేపల్లి మహిళలు

పెనుకొండ, న్యూస్‌టుడే: సోమందేపల్లిలో నిరుపేదలతో గుడిసెలు వేయించేందుకు నగదు తీసుకుని మోసగించాడంటూ సీపీఐ అనుబంధ సంఘం వ్యకాసం(వ్యవసాయ కార్మిక సంఘం) జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామిని స్థానిక ఆర్డీవో కార్యాలయంలో పలువురు మహిళలు నిలదీశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో పెనుకొండ మండలంలోని గోనిపేట గ్రామానికి చెందిన పలువురు నిరుపేదలకు 3 ఎకరాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వ్యకాసం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షుడు నిరసన వ్యక్తం చేస్తుండగా సోమందేపల్లికి చెందిన అంజినమ్మ, సునీతమ్మ, చౌడమ్మ తదితరులు బాలస్వామితో వాగ్వాదం చేశారు. తమతో అక్రమంగా వసూలు చేసిన నగదు ఇవ్వాలని నిలదీశారు. తమతో ఇళ్ల నిర్మాణం చేయించి మోసం చేశాడని విమర్శించారు. అతని ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు తీసుకోవడం లేదని మహిళలు ఆరోపించారు. అక్కడే ఉన్న పోలీసులు కలగజేసుకుని బయటకు పంపడంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం గోనిపేట గ్రామస్థులతో కలసి నిరుపేదలకు భూమి మంజూరు చేయాలని ఆర్డీవో కార్యాలయంలో డీటీ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.

పట్టుబడితే తుప్పు పట్టాల్సిందే..!

చిలమత్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఓ మూలకు పడిన ఈ వాహనాలు చూశారా.. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పు పట్టిపోతున్నాయి. ఏదో ఒక కేసులో వాహనం దొరికిందంటే చాలు ఇలా కావాల్సిందే. . వేలంపాట వేయిస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని మండల ప్రజలు అంటున్నారు. ఈ విషయమై సంబంధిత ఎస్సై మునీర్ అహ్మద్ మాట్లాడుతూ అవి నోటీస్ పీరియడ్‌లో ఉన్నాయి. అది ముగియగానే వేలం పాట వేయనున్నట్లు తెలిపారు. **-న్యూస్‌టుడే, చిలమత్తూరు**



పాడైన పైపులతో నీరు లీకేజీ



మెళవాయి, పాపసానిపల్లి గ్రామాల్లో తాగునీటి పైపులు తప్పు పట్టాయి. ఏళ్ల కాలం నాటివి కావడంతో నీరు లీకవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని కొత్తవి బిగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జయరంగమ్మ మాట్లాడుతూ స్థానిక సర్పంచితో మాట్లాడి కొత్త పైపులు బిగించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

–న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

నీరు వృథా.. చుట్టూ అపరిశుభ్రత

కంబాలపల్లి గ్రామంలో తాగునీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. ట్యాంకు నిండినప్పుడంతా నీరు వృథాగా వెళ్తుండడంతో ట్యాంకు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి దోమలకు నిలయంగా మారింది. చీకటి పడితే దోమల బెడద అధికంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి నర్సేగౌడు మాట్లాడుతూ హరితరాయబారుల ద్వారా అపరిశుభ్రతను తొలగిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం



ఆలోచన నచ్చింది.. కాలుష్యం తగ్గింది

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల యువత పర్యావరణం వైపు అడుగులేస్తున్నారు. వారంతా ఎన్నో ఏళ్లుగా ఆటోలు నడుపుతూ కుటుంబాలు పోషిస్తూ జీవనాలు సాగిస్తున్నారు. రోజువారీగా వచ్చే సంపాదనతో కుటుంబ పోషణతోపాటు పిల్లలను చదివించుకుంటున్నారు. అయితే పెరిగిన ఇంధన ధరలతో చాలా సందర్భాల్లో బాడుగలు గిట్టుబాటుకాక ఇబ్బందిపడ్డారు. ఈ నేపథ్యంలో బ్యాటరీ ఆటోలు తెచ్చుకోవాలన్న ఆలోచనను ఆచరణలో పెట్టి విజయం సాధించారు.

బ్యాటరీ ఆటోల వినియోగం.. పర్యావరణ హితం

నెలకు రూ.600 బిల్లుతో..



గోరంట్లలో నేనే మొదటి డీజిల్ ఆటో తీసుకొచ్చాను. గిట్టుబాటు కాక సన్నిహితుల సలహా మేరకు ఏడాది క్రితం బ్యాటరీ ఆటో తెచ్చుకున్నా. అప్పటి నుంచి విద్యుత్తు బిల్లు నెలకు రూ.600 వస్తోంది. అంటే రోజుకు రూ.20లు మాత్రమే. స్థానికంగా ఏ సమస్య లేకుండా తిప్పగలుగుతున్నాను. ప్రభుత్వం రాయితీ అవకాశం కల్పిస్తే ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించినట్లే.

-సోమశేఖర్, రాజీవ్‌కాలనీ, గోరంట్ల

ఇంధనం కోసం నిత్యం రూ.300

డీజిల్ లేదా పెట్రోల్ ఆటో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికులను ఎక్కించుకుని తిప్పాలంటే రోజుకు రూ.300లకు పైగా అవసరమయ్యేది. అది పోనూ మిగిలిన సొమ్ము ఇంటి ఖర్చులకు వినియోగించుకునే పరిస్థితి ఉండేది. అంతేకాదు రిపేరీల కోసం వచ్చేడబ్బంతా ఖర్చుపెట్టుకోవాల్సిన పరిస్థితి ఉండేది.

నెలకు రూ.10 వేలు మిగులు

ఇంధనం పేరుతో రోజుకు రూపాయి పెట్టుబడిగా పెట్టాల్సిన అవసరం లేదు. రాత్రి ఇంటికి రాగానే బ్యాటరీ ఛార్జింగ్ చేసుకుంటే ఉదయం నుంచి రాత్రివరకు సుమారు 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చని, దీంతో గతంలోకంటే నెలకు రూ.10వేలకు పైగా మిగులుతోందని చెబుతున్నారు.



15 ఏళ్లుగా ఆటో నడుపుతున్నా

నేను 15 ఏళ్లుగా గోరంట్లలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. గతంలో డీజిల్ ఆటో నడుపుతుండేవాడిని. కొంతమంది గోరంట్లలో బ్యాటరీ ఆటోలు తీసుకురావడంతో నేను తెచ్చుకున్నాను. పెట్టుబడి బాగా తగ్గింది. కుటుంబం ఇబ్బంది లేకుండా నెట్టుకురావచ్చని భరోసా పెరిగింది. 50 కిలోమీటర్ల దూరం వరకు వెళ్లి వస్తున్నాను.

-నూర్‌బాషా, గోరంట్ల

బాలుడి కిడ్నాప్ కట్టు కథ

హిందూపురం(మోడల్‌కాలనీ), న్యూస్‌టుడే: హిందూపురం పట్టణ సమీపంలోని టైలర్స్ కాలనీకి చెందిన ఎర్రిస్వామి కుమారుడు శ్రీరామకృష్ణ తన సమీప బంధువులైన మోడల్‌కాలనీలో ఉంటున్న మాజీ కౌన్సిలర్ భారతి ఇంట్లో ఉంటూ 6వ తరగతి చదువుతున్నాడు. సోమవారం కరాటే శిక్షణ ఉందని ఉదయం 6 గంటలకే ఇంటి నుంచి బయలు దేరి వచ్చాడు. శిక్షణ లేదని నిర్వాహకులు చెప్పటంతో వెనక్కి వస్తూ ఇంటికి చేరుకొని నన్ను ముగ్గురు వ్యక్తులు కిడ్నాప్ చేయగా తప్పించుకొని వచ్చానని చెప్పాడు. భయపడిన కుటుంబ సభ్యులు రెండో పోలీస్‌స్టేషన్ సీఐ కరీంకు సమాచారం అందించారు. సీఐ, పోలీసులు, బాలుడు సంచరించిన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పరిశీలించగా ఎక్కడ కిడ్నాపర్ల ఆనవాళ్లు లభించక బాలుడు ఒక్కడే నడిచి వెళుతున్నట్లు గుర్తించారు. చివరికి ఇదంతా బాలుడి కట్టుకథ అని పోలీసులు గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

అమరాపురం : అమరాపురం మండలం కాచీకుంట బస్టాండ్‌లో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తిప్పేస్వామి, బూత్‌రాజు, ఉమేష్, కాంతాకుమార్‌లు గాయపడ్డారు. ఒకే ద్విచక్రవాహనంలో నలుగురు వస్తూ మలుపు వద్ద వేగాన్ని అదుపుచేయలేక బస్సు ప్రాంగణాన్ని ఢీకొనడంతో అందరూ గాయపడ్డారు. అమరాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అనంతరం మడకశిర కర్ణాటక శిర ఆసుపత్రికి తరలించారు.

అనారోగ్యంతో ఆత్మహత్యాయత్నం

హిందూపురం : బోధకాలతో దీర్ఘకాలంగా ఇబ్బందులు పడుతున్న హిందూపురం పట్టణం బోయపేటకు చెందిన వెంకటేశ్ సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో కత్తితో గొంతుకోసుకొనే యత్నం చేశాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించామన్నారు. ప్రస్తుతం అతని స్థితి నిలకడగా ఉన్నట్లు వారు తెలిపారు.

పేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్లు



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ తదితరులు

మడకశిర : నిరుపేదలకు పట్టెడన్నం అందించి ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఐదేళ్లుగా మూతపడి ఉన్న అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే, సతీమణి ఉమాదేవి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. తొలుత అక్కడికి వచ్చిన పలువురికి స్వయంగా ఎమ్మెల్యే భోజనాలు వడ్డించారు. మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధ, తెదేపా రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ, బాబన్న, కౌన్సిలర్ రాజా, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు భక్తర్, పట్టణ కార్యదర్శి పుల్లయ్యాచౌదరి, డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

విద్యుత్తు నియంత్రికల ధ్వంసం

కనగానపల్లి : మండలంలోని తూంచెర్ల, సీసీ కోట గ్రామాల్లోని పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికలను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని నూనె, రాగి తీగలను ఎత్తుకెళ్లారని బాధిత రైతులు ముత్యాలు, సదానంద వాపోయారు. దీనిపై కనగానపల్లి పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

కూటమి ప్రభుత్వంతో గ్రామాలకు మహర్దశ

తాడిమర్రి : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో గ్రామాలకు మహర్దశ రాబోతుందని ఉమ్మడి జిల్లాల సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నిడిగల్లు, నార్సింపల్లి గ్రామాల్లో పల్లెపండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ విజయశేఖర్, ఏపీఓ సంజీవ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హేమలత పాల్గొన్నారు.

గోరంట్లపల్లిలో రోడ్ల దుస్థితిపై ఆరా

కొత్తచెరువు, న్యూస్‌టుడే : కొత్తచెరువు మేజరు పంచాయతీలోని గోరంట్లపల్లి వీధుల్లో రోడ్ల పరిస్థితిని గ్రేడ్-1 కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. 'మురుగు రహదారిపై పరుగు' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. గ్రామాన్ని సందర్శించిన కార్యదర్శి స్థానిక సమస్యలపై గ్రామస్థులను విచారించారు. ఉపాధి హామీ నిధులతో రెండో విడతలో మిగిలిన వీధుల్లో సీసీ రోడ్లను నిర్మిస్తామని పేర్కొన్నారు.



గోరంట్లపల్లిలో మట్టి రోడ్డును పరిశీలిస్తున్న కార్యదర్శి



మాట్లాడుతున్న సత్యసాయి సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు

సత్యసాయి సేవా సమితి ఏర్పాటు

ధర్మవరం: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని సుబ్బదాసు సత్రంలో సత్యసాయి భజన మండలిగా ఉన్న కమిటీని సత్యసాయి సేవా సమితి - 2గా ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మూర్తి, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

గుంతల దారులకు మోక్షం

మరమ్మతులకు రూ.2 కోట్లు మంజూరు

ధర్మవరం పట్టణం, బత్తలపల్లి, ముదిగుబ్బ, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వ హయాంలో రహదారుల నిర్మాణం - నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో రోడ్డు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే రహదారులు గుంతలమయమై అధ్వానంగా తయారయ్యాయి. కనీసం వాటిని పూడ్చిన దాఖలాలు లేవు. దీంతో రోడ్లన్నీ దారుణంగా మారాయి. గుంతల దారిలో రాకపోకలు సాగించే క్రమంలో పలువురు వాహన చోదకులు రోడ్డు ప్రమాదాలకు గురై గాయాలపాలయ్యారు. వేగాన్ని నియంత్రించలేక వాహనాలు అదుపుతప్పి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. రహదారులకు మరమ్మతులు చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రజలు కోరినా స్పందన లేదు. చివరకు కొన్ని చోట్ల ప్రజలు, వాహనదారులే సొంతంగా మట్టిని తోలుకుని గుంతలను పూడ్చారు.



అధ్వానంగా పుట్టపర్తి రోడ్డు



గుంతలమయమైన బత్తలపల్లిలోని తాడిపత్రి రహదారి

24 కి.మీ. మేర పనుల గుర్తింపు

ధర్మవరం నియోజకవర్గంలోని పలు ప్రధాన రహదారుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిలో ధర్మవరం నుంచి పుట్టపర్తి, ఎన్‌ఎస్ గేట్ జంక్షన్, ధర్మవరం పట్టణంలోని వంతెనపై దారి, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లోని బత్తలపల్లి, రామాపురం, సీసీరేవు, మర్రిమాకులపల్లి, మాల్యవంతం తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు దెబ్బతిన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో పాటు మంత్రివర్గ సమావేశంలో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా గుంతలుపడిన దారులను ర.భ. శాఖ అధికారులు గుర్తించారు. తక్షణమే 24 కి.మీ. మేర మరమ్మతులు చేయించాలని, రూ. 2 కోట్లు నిధులు అవసరమని ఆ శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తాజాగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. పనులు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానించారు.

టెండర్లు పూర్తికాగానే..

మరమ్మతు పనులు చేపట్టేందుకు టెండర్లను ఆన్‌లైన్ ద్వారా పిలిచాం. ఆ ప్రక్రియ పూర్తవ్వగానే పనులు చేపట్టి త్వరితగతిన ముగిస్తాం. గుంతలను పూడ్చివేసి రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం.

- నాగపుల్లంరావు, డీఈ, ర.భ. శాఖ, ధర్మవరం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222



సమస్య : పిల్లవంక కాలనీ వీధిలో మట్టిని తవ్వి వదిలేశారు. కాలువలు లేకపోవడంతో మురుగు నిల్వ చేరి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

- రాము, పిల్లవంక కాలనీ

సమాధానం : మట్టిని తొలగించి మురుగు నిల్వ లేకుండా చేస్తాం.

సమస్య : పిల్లవంక కాలనీలోని పార్కు స్థలంలో ముళ్లపొదలతో నివాసాల మధ్య అడవిని తలపిస్తోంది. దీంతో విష పురుగుల సంచారంతో ప్రమాదకరంగా ఉంది. **- రవి, పిల్లవంక కాలనీ**

సమాధానం : పార్కు స్థలంలో ముళ్లకంపల తొలగించి సమస్య పరిష్కరిస్తాం.

(ఈ రెండు సమస్యలకు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ సమాధానమిచ్చారు) - న్యూస్‌టుడే, కదిరి

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్థానిక రెవెన్యూ డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులతో ఆర్డీఓ మహేశ్ అత్యవసర సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆర్డీఓ ఆదేశించారు. డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. వర్షాల వల్ల ఎక్కడ ఇబ్బందులు తలెత్తినా వెంటనే సహాయక చర్యలు చేపట్టాలన్నారు. మరో మూడు రోజుల పాటు అన్ని శాఖల అధికారులు వర్షాలపై అప్రమత్తంగా ఉండి పనిచేయాలని ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని ఆర్డీఓ అన్నారు. ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఖలీజాన్ ఖుబ్రా, పురపాలక కమిషనర్ ప్రమోద్‌కుమార్, డివిజన్‌లోని తహసీల్దార్లు, పోలీసు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ మహేశ్

దెబ్బతిన్న వంతెన పరిశీలించిన ఆర్డీవో

ముదిగుబ్బ: మండలంలోని గంగిరెడ్డిపల్లి - కొడవండ్లపల్లి మధ్య మద్దిలేరు వాగుపై నిర్మించిన వంతెన దెబ్బతిని శిథిలావస్థకు చేరుకోవడంతో సోమవారం ధర్మవరం ఆర్డీఓ మహేశ్ పరిశీలించారు. 2021లో అధిక వర్షాలకు విరిగిపడిన వంతెన తాత్కాలికంగా మట్టివేసి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న వంతెన గురించి సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మద్దిలేరువాగులో అధికంగా నీరు వప్రవహిస్తే వంతెన విరిగిపడుతుందని సిబ్బంది తెలపడంతో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆర్డీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దారు నారాయణస్వామి, వీఆర్ఓ వీరయ్య పాల్గొన్నారు.

భవన నిర్మాణం.. పునాదులకే పరిమితం

తలుపుల: మండలంలోని లక్ష్మీసముద్రం సచివాలయంలో వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.20.8లక్షలతో చేపట్టిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనం పునాదులకే పరిమితమైంది. గ్రామ సచివాలయ భవనంతోపాటు వ్యవసాయ కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను సంబంధించి మూడు భవనాలను ఆదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచి నిర్మాణం చేపట్టారు. వీటిలో సచివాలయం, ఆర్బీకే భవనాలు దాదాపు 80శాతం పూర్తి చేశారు. వాటికి బిల్లులు అప్పటి కార్యదర్శి రాజేశ్, సర్పంచి సంతకాలను ఫోర్జరీ చేసి దాదాపు రూ.5లక్షల వరకు స్వాహా చేశారు. ఆ నగదు కోసం సంబంధిత గుత్తేదారు పనులు ఆపేసి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామానికి దాదాపు రూ.85లక్షల నిధులు మంజూరైనా ఒక్క భవనం పూర్తి చేసిన దాఖలాలు లేవు. పురాతన పంచాయతీ కార్యాలయంలోనే అన్ని శాఖల సేవలు అందిస్తున్నారు. దీనిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్ గణేష్‌ను వివరణ కోరగా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు.



'వైకాపా హయాంలో పల్లెల ప్రగతిపై నిర్లక్ష్యం'

కొత్తచెరువు, న్యూస్‌టుడే : కొత్తచెరువు మండలంలో ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం పనులను సోమవారం ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, తెదేపా నాయకులు, అధికారులతో కలిసి భూమి పూజ చేసి ప్రారంభించారు. రూ. 3.29 కోట్లతో 67 పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో పల్లెలు, పంచాయతీలను నిర్లక్ష్యం చేయడంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్డు సౌకర్యాలను కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు నీలకంఠారెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ నటరాజ్, మేజరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మండల ఇంజినీరు నాగరాజు, కన్వీనర్ రామకృష్ణ, పట్టణ కన్వీనర్ పలిపి శీనా, తెదేపా, జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు.



కొత్తచెరువు నెహ్రూనగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింధూర

గ్రామాభివృద్ధికే పల్లెపండగ వారోత్సవాలు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : గ్రామాభివృద్ధి కోసమే ప్రభుత్వం 'పల్లె పండగ' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీపీ ఆదినారాయణయాదవ్ పేర్కొన్నారు. సోమవారం ముదిగుబ్బ మండలంలోని పెద్దచిగుళ్లరేవు, ఉప్పలపాడు, రాళ్లఅనంతపురంక్రాస్, నల్లచెర్లోపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓఆర్డీ దివాకర్, ఏపీఓ రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ ఆదినారాయణయాదవ్

నల్లచెరువు (కదిరి) : మండలంలోని రాట్నాలపల్లిలో రూ.10 లక్షలతో రోడ్డు నిర్మాణం పనులకు ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీఓ రఘునాథగుప్తా భూమిపూజ చేశారు. **అమడగూరు :** మండలంలోని పూలకుంటపల్లిలో సోమవారం సీసీ రహదారుల పనులకు ఎంపీడీఓ మునెప్ప, ఏపీఓ అమరావతి, నాయకులు శంకుస్థాపన చేశారు.

నంబులపూలకుంట, గాండ్లపెంట : గాండ్లపెంట మండలం చెరువుముందర తండాలో సీసీ రహదారి పనులకు ఏపీఓ మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి భూమి పూజ చేశారు. ఎన్పీకుంటలో మండల అధికారులు, నాయకులతో కలిసి మామిడి మొక్కలు నాటారు.

తలుపుల : మండలంలోని ఉదుములకుర్తి, ఓదులపల్లి, గొల్లపల్లితండా, కొండ్లు పంచాయతీలో రూ.55 లక్షలతో 9 సిమెంటు రోడ్ల నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేసినట్లు ఎంపీడీఓ రామానాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ హరూన్‌రషీద్, టీపీ మోహన్, ఉపాధి సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం పట్టణం : మండల పరిధిలోని గొట్లూరు, చిగిచెర్ల, తుమ్మల, సుబ్బారావుపేట గ్రామాల్లో పల్లెపండగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమాన్ని ఎంపీడీఓ సాయి మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇదే మీకు చివరి హెచ్చరిక

విద్యుత్తు ఏఈపై ఎమ్మెల్యే సింధూర ఆగ్రహం

కొత్తచెరువు, న్యూస్‌టుడే : 'మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా విద్యుత్తు సమస్యలపై వరుస ఫిర్యాదులు వస్తున్నాయి. ఫోన్ చేసినా అందుబాటులోకి రారు. ఎన్నిసార్లు చెప్పినా స్పందించడంలేదు. ఇదే మీకు చివరి హెచ్చరిక' అంటూ ఎమ్మెల్యే సింధూర విద్యుత్తు శాఖ ఏఈ వెంకటేశ్ నాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కొత్తచెరువు బీసీ కాలనీలో పర్యటన సందర్భంగా స్థానికులు విద్యుత్తు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పదేపదే ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఓపిక నశించిన ఎమ్మెల్యే ఒక్కసారిగా ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు సక్రమంగా పనిచేస్తేనే ఉండండి. లేదంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా. కనీసం నేను ఫోన్ చేసినా స్పందించరు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలకు నేనేం సమాధానం చెప్పాలి.' అంటూ మండిపడ్డారు. ఇదే మీకు చివరి హెచ్చరిక అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తుపాను హెచ్చరికతో కదిలిన అధికారులు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : తుపాను వల్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. కదిరి పట్టణానికి ఆనుకుని ఉన్న విఠల్‌రాయుని చెరువు మరవవాగు, మద్దిలేరు వాగును తహసీల్దారు మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, నీటిపారుదల శాఖ ఏఈలు బయన్న, మహేశ్ పరిశీలించారు. వాగు చుట్టూ ఉన్న నిర్మాణాలు, వరద ప్రవాహం ఎక్కువైతే ఇళ్లలోకి నీరు చేరకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. వాగులు ఆక్రమణ, వర్షపునీటి ప్రవాహాన్ని మళ్లించేందుకు యత్నించే వారిని ఉపేక్షించమని అధికారులు హెచ్చరించారు. వాగు పరిసరాల్లో ఆక్రమణలు, పిచ్చిమొక్కలు తొలగించడం, పూడిక తీయాలని నిర్ణయించారు.



విఠల్‌రాయుని చెరువు మరవంకను పరిశీలిస్తున్న అధికారులు

ధర్మవరంలో మోస్తరు వర్షం

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరం పట్టణంలో సోమవారం ఓ మోస్తరుగా వర్షం పడింది. ఉదయం నుంచి చిరుజల్లులు పడుతుండటంతో పట్టణ ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రతి సోమవారం రద్దీగా ఉండే ధర్మవరం పట్టణ ప్రధాన రహదారులు వెలవెలబోయాయి. జన సంచారం తక్కువగా కనిపించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో పట్టణంలో వాహనాల రద్దీ తగ్గింది. కొద్ది రోజులుగా ఉక్కపోత వాతావరణంతో ఇబ్బందులు పడ్డ పట్టణ వాసులు వర్షం కురవడంతో ఉపశమనం పొందారు.

తల్లి, పిల్లల అదృశ్యంపై కేసు

ధర్మవరం: ధర్మవరంలోని నాగులబావి వీధికి చెందిన వివాహిత శ్రావణి, ఆమె కుమార్తె లలిత, కుమారుడు జయంత్ ఈ నెల 12న దుర్గమ్మ గుడికి వెళ్లి కనిపించకుండాపోయారని సోమవారం ధర్మవరం 1వ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆమె భర్త శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి 7 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన వారు తిరిగి ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల వెతికినా కనిపించలేదని ఆయన తెలిపారు. ఫిర్యాదు తీసుకున్న 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో చేనేత కార్మికుడికి గాయాలు

ధర్మవరం: ధర్మవరంలోని గాంధీనగర్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తారకరామాపురం కాలనీకి చెందిన చేనేత కార్మికుడు రమేశ్ తీవ్రంగా గాయపడ్డారు. ఇంటి నుంచి పని నిమిత్తం పట్టణంలోకి వస్తుండగా గాంధీనగర్ వద్ద ఆటో ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన అతన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై ధర్మవరం 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

రామగిరి : మండలంలోని కలికివాండ్లపల్లి గ్రామానికి చెందిన నాగేంద్ర భార్య కావ్య పురుగు మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న కారు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ఆగి ఉన్న సరకు రవాణా వాహనాన్ని కారు ఢీకొంది. ఈ ఘటన చెన్నేకొత్తపల్లి మండలం దామాజిపల్లి 44వ జాతీయ రహదారి కూడలి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై సత్యనారాయణ వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం కలబురగి(గుల్బర్గా)కు చెందిన నలుగురు మిత్రులు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. దసరా పండగకు స్వగ్రామాలకు వెళ్లి తిరిగి బెంగళూరు వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి సరకు రవాణా వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో వీరేశ్, సంగనాథ్, సిద్ధలింగ తీవ్రంగా గాయపడ్డారు. కారు నడుపుతున్న హరీశ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను అత్యవసర వాహనంలో సీకే పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రయాణికులతో రైలు కిటకిట



ధర్మవరం రైల్వేస్టేషన్‌లో తిరుపతి ప్యాసింజర్ రైలులో వెళ్లేందుకు కిక్కిరిసిన ప్రయాణికులు

ధర్మవరం, న్యూస్‌టుడే : దసరా సెలవులు ముగియడంతో కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో ధర్మవరం రైల్వేస్టేషన్ సోమవారం కిటకిటలాడింది. గుంతకల్లు నుంచి తిరుపతి వెళ్లే ప్యాసింజర్ రైలులో ధర్మవరం నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు వెళ్లారు. మదనపల్లి, తిరుపతి ప్రాంతాల్లోని కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు వందలాది మంది రైలులో వెళ్లేందుకు రావడంతో రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం కిక్కిరిసింది. ధర్మవరానికి రైలు రాగానే బోగీల్లోకి ఎక్కేందుకు పోటీపడ్డారు. ధర్మవరానికి రైలు వచ్చేటప్పటికే బోగీలు నిండిపోయాయి. దీంతో విద్యార్థులు రైలులో నిలబడే ప్రయాణించారు. కొందరు విద్యార్థులు రైలు బోగీ వాకిలి వద్ద నిలబడి ప్రమాదకరంగా వెళ్లాల్సి వచ్చింది.

వ్యర్థాల దిబ్బగా మద్దిలేరువాగు

మున్సిపల్ అధికారుల చర్యలు అంతంత మాత్రమే

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామివారి భక్తుడి పేరిట ఉన్న పవిత్ర మద్దిలేరు వాగును వ్యర్థాలతో పూడ్చేస్తున్నారు. స్వామి వారి కోనేరుకు ఆనుకుని ఈ వాగు ఉంది. దేవరచెరువు, విఠల్‌రాయునిచెరువు వాగుల మరవనీటితో పారే ఈ వాగు సుమారు 40 కిలోమీటర్లు ప్రవహించి ముదిగుబ్బ మండలం యోగి వేమన జలాశయంలో కలుస్తుంది. వర్షాభావ పరిస్థితులు నెలకొని మద్దిలేరువాగులో నీటి ప్రవాహం తగ్గడంతో క్రమంగా ఆక్రమణకు గురవుతూ వస్తోంది. మరోవైపు హిందూపురం ప్రధాన మార్గంలో ఈ వాగును వ్యర్థాలతో పూడ్చేస్తున్నారు. పనికిరాని వస్తువులు, మాంసం దుకాణాల వ్యర్థాలను వాగులో పడేస్తుండటంతో వాగుపూడిపోతోంది. స్థానికులతో పాటు కొందరు పారిశుద్ధ్య సిబ్బంది కూడా పట్టణంలో సేకరించిన వ్యర్థాలను వాగులో వదిలేస్తున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన మున్సిపల్ అధికారులు చెత్తవేయ కూడదంటూ హెచ్చరిక బోర్డు పెట్టినా.. పట్టించుకోవడం లేదని స్వామి వారి భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దిలేరులో చెత్తను వేయకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా మద్దిలేరు వేసిన చెత్తను ఇప్పటికే తొలగించేశామన్నారు. వ్యర్థాలను వాగులో వదలడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను వివరించి అవగాహన కల్పిస్తామన్నారు. చెత్తను వాగులో వదులుతున్న సిబ్బందిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.



మద్దిలేరువాగులోకి వదులుతున్న వ్యర్థాలు

కార్మికశాఖ కార్యాలయం ఏర్పాటుకు డిమాండ్

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంతో పాటు, 7 మండలాల్లో 20 వేల మంది కార్మికులున్నారని, వారి సమస్యలను చెప్పుకొనేందుకు కార్మిక శాఖ కార్యాలయం లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని సీఐటీయూ కన్వీనర్ జేవీ రమణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో కార్మిక శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పట్టణంలోని కార్మిక శాఖ కార్యాలయాన్ని కొత్తచెరువుకు తరలించారని, దీని వల్ల ఇక్కడ కార్మికుల సమస్యలు వినేవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మిక శాఖ కార్యాలయాన్ని ధర్మవరంలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అయూబ్‌ఖాన్, బాబు, పుల్లన్న, పెద్దక్క, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పాలసీదారులకు బోనస్ పెంచండి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : జీవిత బీమా పాలసీదారులకు జీఎస్టీ తొలగించి, బోనస్ పెంచాలని సోమవారం కదిరిలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఏజెంట్లు నిరసన ప్రదర్శన చేపట్టారు. జీవిత బీమా సంస్థ యాజమాన్య తీరుకు నిరసనగా ఈ నెల 28 వరకు ఆందోళన చేపట్టనున్నట్లు ప్రకటించారు. గేట్ మీటింగ్ నిర్వహించి ఏజెంట్లకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. చిన్నపాలసీలను పునరుద్ధించరాలని డిమాండు చేశారు. లియాఫీ నాయకులు నారాయణరెడ్డి, నగేశ్‌బాబు, రమణారెడ్డి, వెంకటేశ్, కోటేశ్వరయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏజెంట్లు

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

బత్తలపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు రామాపురం జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు తెలిపారు. నవంబరు, డిసెంబరులో అన్నమయ్యజిల్లా, తూర్పుగోదావరి జిల్లాలో జరిగే అండర్-14 పోటీల్లో ప్రణీత, అండర్-17లో ఇబ్రహీం, చందన, ధనుష్ పాల్గొంటున్నారని పీఈటీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మురుగు దారిలో అవస్థలు బారెడు



ముదిగుబ్బ మండలంలోని నల్లచెర్లోపల్లిలో చిన్నపాటి వర్షానికే ఇళ్లముందు మురుగు కుంటగా ఏర్పడి పరిసరాలు అధ్వానంగా మారాయి. నివాసాల ముందు మట్టిరోడ్డు కావడంతో ఎగువప్రాంతం నుంచి వచ్చిన మురుగంతా దిగువకు వెళ్లేందుకు కాలువ లేకపోవడంతో అక్కడే నిలుస్తోంది. ముక్తాపురం పంచాయతీ కార్యదర్శి అచ్యుత్‌రెడ్డిని వివరణ కోరగా మురుగు నిల్వలేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, ముదిగుబ్బ**

ఎమ్మెల్యే పరామర్శ

రామగిరి : మండలంలోని గంగంపల్లి తండాకు చెందిన శ్రీరామ్‌నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. సోమవారం ఆయన్ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శించారు. ఆమె వెంట తెదేపా నాయకులు రామ్మూర్తినాయుడు, పరంధామయాదవ్ ఉన్నారు.

గుడి నిర్మాణానికి విరాళం

నల్లచెరువు (కదిరి) : నల్లచెరువులో నూతనంగా నిర్మిస్తున్న సీతారాముల గుడి నిర్మాణానికి సోమవారం కురుమాలకు చెందిన గంగాదేవి రూ.5 వేలను విరాళం అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ నిర్మాణ పనులకు వినియోగించాలని కోరారు.

గాలి వీచినప్పుడల్లా సమస్య

కదిరి మండలం చలమకుంట్లపల్లి పంచాయతీ పరిధిలోని జౌకల గ్రామ ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్తు స్తంభానికి చెట్ల కొమ్మలు, తీగలు అల్లుకుపోయాయి. వర్షానికి, గాలులకు చెట్ల కొమ్మల రాపిడి ఏర్పడి విద్యుత్తు సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. అనుకోని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ విషయాన్ని కదిరి మండల విద్యుత్తు ఏఈ గౌరీ శంకర్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపి కొమ్మలు, తీగలు తొలగించి ఇబ్బందుల్లేకుండా చూస్తామన్నారు.

- న్యూస్‌టుడే, కదిరి గ్రామీణం

